సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం, 12, జూలై, 2023



బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

పాడేరు–చోడవరం ఘాట్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. 8లో



సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

సంక్షేమం, అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ జగనన్న ప్రభుత్వమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. 8లో



డెంగ్యూపై అప్రమత్తత అవసరం

డెంగ్యూపట్ల అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి సబ్ యూనిట్ అధికారి ఆర్. కన్నబాబు సూచించారు. 8లో

న్యూస్‌రీల్

జగనన్న సురక్షలో 6,812 ధ్రువపత్రాల పంపిణీ

పాడేరు రూరల్ : జిల్లా వ్యాప్తంగా మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 6,812 ధ్రువపత్రాలు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 13 మండలాల పరిధిలోని 22 గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించామని ఆయన తెలిపారు. 19,250 గృహాల నుంచి గ్రామ వలంటీర్ల యాప్‌లో వివిధ ధ్రువీకరణ పత్రాలకు వినతులు వచ్చాయన్నారు. వీటికి గాను 18,565 టోకెన్లు జారీ చేశామన్నారు. 14,280 దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగా వీటిలో 6,812 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. 123 దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయని, మిగిలిన 7,273 ధ్రువీకరణ పత్రాలు కూడా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

నష్ట పరిహారం చెల్లింపునకు చర్యలు

- పాడేరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

డుంబ్రిగుడ: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భూములు కోల్పోయిన లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పాడేరు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న భూ హక్కు రీసర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ పరమైన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్‌వోగా పరిమళ



కొయ్యూరు:స్థానిక కేజీబీవీ ప్రత్యేకాధికారిగా పరిమళ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.ఆమె రోలుగుంట నుంచి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు మెరుగైన విద్యను అందిస్తామన్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఆంగ్లం బోధించే ఉపాధ్యాయురాలు శాంతకుమారి ఎస్‌వోగా బాధ్యతలు నిర్వహించారు.

నేటి నుంచి ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు

కూనవరం: మండలంలో బుధవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు ప్రాధాన్యత గ్రామాల్లోని గిరిజన నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కె.అనసూయ మంగళవారం తెలిపారు. కూనవరం, టేకులబోరు, టేకుబాక గ్రామాల్లో వారికి బుధవారం మధ్యాహ్నం 3గంటలకు టేకులబోరు రచ్చబండ వద్ద గ్రామసభ జరుగుతుందన్నారు. ఈనెల 13 మధ్యాహ్నం 3 గంటలకు పంద్రాజుపల్లి, 14 మధ్యాహ్నం పెదార్కూరు, 15 ఉదయం 10.30 గంటలకు శబరి కొత్తగూడెం, మధ్యాహ్నం 3.00 గంటలకు కొండ్రాజు పేటలో రచ్చబండ వద్ద గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాలను గిరిజన నిర్వాసితులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

జల్ జీవన్ మిషన్ పనుల తనిఖీ



బలపాం గెడ్డను దాటుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీలీలాకృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు

జి.మాడుగుల: గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న తాగునీటి పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీలీలాకృష్ణ తెలిపారు. మండలంలో పెదలువ్వాసింగి పంచాయతీలో మానేపల్లి, కిల్లుపల్లి, పార్లుగుంట గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పనులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయా గ్రామాలకు బలపాం గెడ్డను దాటి, మూడు కిలోమీటర్ల మేర కాలినడకన ఇంజినీరింగ్ అధికారులు సందర్శించారు. జల్‌జీవన్ మిషన్ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. మానేపల్లి గ్రామంలో జేజే పనులు పూర్తి అయినట్టు గిరిజనుడికి ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు, చింతపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు జీవీఎస్ ప్రకాష్, రుక్మేంద్రరరాజు, జి.మాడుగుల, చింతపల్లి ఏఈలు విజయ్‌కుమార్, స్వర్ణలత పాల్గొన్నారు.

భగ్గుమన్న వలంటీర్లు



జడ్డంగిలో పవన్ కల్యాణ్ చిత్ర పటాలను తగులబెడుతున్న వలంటీర్లు

ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే వలంటీర్లపై పవన్ కల్యాణ్ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడంపై జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ నిరసనలు వెల్లువెత్తాయి. అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ వలంటీర్లు రోడ్డెక్కారు. పవన్ కల్యాణ్ చిత్రాలకు నిప్పంటించి దహనం చేశారు. చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు ఆందోళనలతో పాల్గొని మద్దతు పలికారు.

రాజవొమ్మంగి: సామాజికసేవలో అహర్నిశలు కష్టపడుతున్న వలంటీర్లపై అనుచిత వాఖ్యలు చేసినందుకు పవన్ కల్యాణ్ లెంపలు వేసుకొని క్షమాపణ చెప్పాలని వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని జడ్డంగిలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తమకు ఇచ్చే గౌరవ వేతనంతో, ప్రతి కుటుంబం పట్ల సేవాదృక్పథంతో పనిచేస్తున్న తమ పట్ల కించపరిచేలా మాట్లాడం సరికాదని జడ్డంగి, చెరకుంపాలెం వలంటీర్లు హెచ్చరించారు. ప్రధాన రహదారి వరకు సుమారు 50 మంది వలంటీర్లు ఆందోళన నిర్వహించారు. పవన్ కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఆయన చిత్ర పటాలను చెప్పులతో కొడుతూ నిప్పంటించి దహనం చేశారు.

వలసపక్షి పవన్ కల్యాణ్

తెలంగాణా వలసపక్షి పవన్‌కల్యాణ్ షూటింగ్ లేనప్పుడు ఆంధ్రాకు వచ్చి చంద్రబాబు ఇచ్చే స్క్రిప్ట్ చదవడం ఆనవాయితీగా మారిందని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్/ జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ ధ్వజమెత్తారు. ప్రభుత్వ విభాగాలు వేటిపైనా ఆయన ఇసుమంత అవగాహన లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, చెరకుంపాలెం సర్పంచ్ దాసరి నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు. ఎస్‌ఐ షరీఫ్ బందోబస్తు ఏర్పాటు ఏర్పాటుచేశారు.

మారేడుమిల్లి : జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ మండల వలంటీర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే పవన్ కల్యాణ్ బహిరంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ల పట్ల తప్పుడు ఆరోపణలు చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. అనంతరం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వలంటీర్లు వేదమణి, లచ్చిరెడ్డి, సురితిక, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో వలంటీర్లు ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల నుంచి పోలీసుస్టేషన్ వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వలంటీర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్లు కొండబాబు మాట్లాడుతూ వలంటీర్లపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం పవన్ కల్యాణ్‌కు చేతకాని తనానికి నిదర్శనమన్నారు.

అంతాడలో దిష్టిబొమ్మ దహనం

కొయ్యూరు: వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం అంతాడలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను వలంటీర్లు దహనం చేశారు. పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయన బహిరంగంగా క్షమాపణ చెప్పేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.

ఎటపాక: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ వలంటీర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నెల్లిపాక సెంటర్లోని జాతీయరహదారిపై వలంటీర్లు మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ చిత్ర పటాలను దగ్ధం చేశారు. సేవే లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై అనుచిత వ్యాఖ్యలు చేయడం హేయమైన చర్య అని అన్నారు. వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. భూక్యా వినోద్ కుమార్, నాగరాజు, కొండబాబు, నరేష్, కృష్ణ, సరోజిని పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: ప్రజలకు సేవ చేస్తున్న గ్రామ వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మంగళవారం సొవ్వా గ్రామ సచివాలయం ఎదుట గ్రామ వలంటీర్లు నిరసన తెలిపారు. వారికి మద్దతు తెలిపిన స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు నరసింగరావు, అశోక్‌కుమార్ మాట్లాడుతూ వలంటీర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నేత రామారావు, గ్రామ వలంటీర్లు రాజు, రంభ , గోపాల్, బాలకృష్ణ, శ్రీధర్, కూల్‌ధర్, బీమో పాల్గొన్నారు.

జి.మాడుగుల: వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు సరికాదని వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, కూడా చిన్నారావు, సర్పంచ్ సీదరి కొండబాబు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లు రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్నారన్నారు. ఆయనను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నేతలు జేసీఎస్ మండల ఇన్‌చార్జి లంకెల కల్యాణం, పాంగి అంద్రయ్య, సల్లంగి ప్రశాంత్ పాల్గొన్నారు.

వై.రామవరం: అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని గ్రామ వలంటీర్లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం వై.రామవరంలో వారు నిరసన తెలిపారు. పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే క్షమాపణ చెప్పాలని లేకుంటే బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అనంతరం స్థానిక బస్టాండు ఆవరణలో మానవహారం నిర్వహించారు. పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను మహిళా వలంటీర్లు చెప్పులతో కొట్టారు. అనంతరం నిప్పటింపిం తగులబెట్టారు. మండల దిగువ ప్రాంతంలోని 11 సచివాలయాల గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. వీరికి వైఎస్సార్‌సీపీ నేతలు నాయకులు గుడ్ల త్రిమూర్తులు, బచ్చలి రమేష్, కరణం కనకరాజు, పసుపు లేటి పద్మనాభం, మంచినీళ్ల నారాయణరావు, పల్లాల తమ్మిరెడ్డి, తదితరులు మద్దతు తెలిపారు.

గూడెంకొత్తవీధి: రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే పవన్‌కల్యాణ్ వలంటీర్లపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండల వలంటీర్ల సంఘ అధ్యక్షుడు కత్తిసాయిపవన్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనుచి వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టీడీపీతో కుమ్మక్కై పవన్ కల్యాణ్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వలంటీర్ల సంఘ ప్రతినిధులు గిరి, సేవా సతీశ్, ప్రేమ్‌కుమార్,పూజారీ శంకర్, ఈశ్వరి,మహేశ్,పుష్ప పాల్గొన్నారు.

రంపచోడవరం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వలంటీర్లుపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా రంపచోడవరం మండలంలో పలు చోట్ల వలంటీర్లు ఆందోళన నిర్వహించారు. బందపల్లి సచివాలయం పరిధిలో వాలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో పవన్‌కల్యాణ్‌పై ఫిర్యాదు చేశారు. రంపచోడవరం మండల సచివాలయ కన్వీనర్ పండా రామకృష్ణదొర, రంపచోడవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ రాపాక సుధీర్ మాట్లాడుతూ పవన్ కల్యాణ్ నిరాధారమైన ఆరోపణలు చేయడం అతని తెలివి తక్కువతనానికి నిదర్శనమన్నారు.

వలంటీర్ వ్యవస్థ వల్లే పోడు భూమికి పట్టా



బాయమ్మ పేరిట మంజూరైన పోడుభూమి పట్టా



పాంద్రు బాయమ్మ

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు పాంద్రు బాయమ్మ. ఈమెది చింతూరు మండలంలోని ఎర్రంపేట. ప్రస్తుతం ఈమె వితంతు పింఛను పొందుతోంది. ఈమె తన భర్తతో కలసి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవించేది. వీరు 1990 నుంచి తమ పోడు భూమికి పట్టా కోసం అనేకమార్లు దరఖాస్తు చేసుకున్నారు. అయినా వీరికి పట్టా లభ్యం కాలేదు. 2016లో భర్త చనిపోవడంతో ఒంటరిగానే బిడ్డల సాయంతో పోడు వ్యవసాయం చేసుకుంటోంది. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వలంటీరు పాంద్రు మహేష్ ద్వారా మరోమారు తమ పోడు భూమికి పట్టా కోసం దరఖాస్తు చేసుకుంది. దీంతో 2021లో ఈమెకు అటవీ హక్కుల చట్టం కింద గ్రామంలో 7.62 ఎకరాలకు పోడు పట్టా లభించింది. గతంలో పట్టాకోసం ఎంతోమంది అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయిందని, వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో వలంటీరు ఇంటికి వచ్చి మరీ దరఖాస్తు తీసుకుని పట్టా వచ్చేలా కృషి చేసారని ఆమె సంతోషం వ్యక్తం చేసింది.

వలంటీర్లకు క్షమాపణ చెప్పాల్సిందే

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి డిమాండ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, చిత్రంలో ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

కొయ్యూరు: సమాజంలో హుందాగా ఉన్న వలంటీర్ వ్యవస్థను కించ పరిచే విధంగా మాట్లాడిన జనసేన నేత పవన్‌కల్యాణ్ భేషరతుగా క్షమాపణ చెప్పాలని పాడేరు ఎమ్మెల్యే కె. భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె అంతాడలో విలేకరులతో మాట్లాడారు. వలంటీర్లు తక్కువ గౌరవ వేతనం తీసుకుంటున్నా సమాజంలో వారి సేవలు వెలకట్టలేనివన్నారు..అలాంటి వ్యవస్థపై పవన్‌కల్యాణ్ సంఘ విద్రోహుల ముద్ర వేయడం తగదన్నారు. వలంటీర్లు సంఘ విద్రోహులకు సమాచారం ఇవ్వడం మూలంగా మహిళలపై దాడులు పెరిగాయని చెప్పడం సిగ్గు చేటన్నారు. వలంటీర్ వ్యవస్థ 2019 నుంచి అమలులో ఉందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతీ పథకాన్ని ప్రజలకు చేరవేయడంతో కీలక భూమిక పోషిస్తున్న వలంటీర్లపై తప్పుగా మాట్లాడడం మంచిది కాదన్నారు. ఒకప్పుడు పింఛన్ తీసుకోవడానికి పండుటాకులు ఎన్ని కష్టాలు పడ్డారో పవన్‌కు తెలియకపోవడం దురదృష్టమమన్నారు. నేడు తొలిరోజే తెల్లవారకముందే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేస్తున్నారన్నారు. వలంటీర్ వ్యవస్థతో కలిగిన మేలును చూస్తున్న ప్రజలు పవన్‌కళ్యాణ్‌కు బుద్ధి చెబుతారన్నారు. 2021 ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం మహారాష్ట్రలో 33,788, మధ్యప్రదేశ్‌లో 3,560 తెలంగాణలో 13వేల వరకు అదృశ్యం కేసులు నమోదయ్యాయన్నారు. అక్కడ ఏ వలంటీర్ వ్యవస్థ ఉందని అన్ని కేసులు నమోదయ్యాయో పవన్ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రతీ వలంటీర్ ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ రమేష్‌బాబు, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, మండల కన్వీనర్ బండి సుధాకర్, డౌనూరు ఎంపీటీసీ బి.అప్పారావు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రేగటి మునిలినాయుడు, సర్పంచ్ చందు తదితరులు పాల్గొన్నారు.



రంపచోడవరంలో ఎస్‌ఐకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



గూడెంకొత్తవీధిలో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ వలంటీర్లు



జి.మాడుగులలో మాట్లాడుతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు



వై.రామవరంలో పవన్‌కళ్యాణ్ దిష్టి బొమ్మను చెప్పలతో కొడుతున్న మహిళా గ్రామ వలంటీర్లు



మారేడుమిల్లిలో ఎస్‌ఐ రాముకు ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు



అంతాడలో పవన్‌కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు



హుకుంపేటలో ర్యాలీ చేస్తున్న గ్రామ వలంటీర్లు



నెల్లిపాక సెంటర్లో నిరసన తెలుపుతున్న వలంటీర్లు



సొవ్వాలో నినాదాలతో నిరసన తెలుపుతున్న గ్రామ వలంటీర్లు

ప్రతీ బిడ్డకు వ్యాక్సినేషన్ తప్పనిసరి

- శిశు మరణాల నివారణే లక్ష్యంగా సేవలు
- బర్త్ వెయిటింగ్ హాళ్లు సక్రమంగా నిర్వహణ
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



హాజరైన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

పాడేరు రూరల్ : పుట్టిన ప్రతీ బిడ్డకు విధిగా వ్యాక్సినేషన్ వేయాలని, జిల్లాలో శిశు మరణాల నివారణే లక్ష్యంగా వైద్య సేవలందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని ఐటీడీఏ పీవోలు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. విధిగా బుధ, శుక్రవారాల్లో వాక్సినేషన్ చేయాలన్నారు. పీహెచ్‌సీల్లో వ్యాక్సినేషన్ కొరత ఉంటే ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఐటీడీఏ ఏపీవోలు పీహెచ్‌సీలను తనిఖీ చేయాలన్నారు. శిశు మరణాల గణంకాలు అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒకే విధంగా ఉండాలని శిశు మరణాల నమోదులో వ్యత్యాసం ఉండకూడదన్నారు. వ్యాక్సినేషన్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఏఎన్‌ఎం పోర్టల్‌ను వైద్యాధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. గర్భిణులు బ్యాంకు ఖతాలు తెరవటానికి ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు బ్యాంక్ ఖాతాలు ప్రారంభించాలన్నారు. జననీ సురక్షా యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన ప్రోత్సాహకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు గిరిజనులకు ఆర్థిక ఆసరాగా ఉంటుందన్నారు. గిరి శిఖర గ్రామాల గర్భవతులను సకాలంలో బర్త్ వెయిటింగ్ హాళ్లకు తరలించి సుఖ ప్రసవం జరిగేలా చూడాలని సూచించారు. జిల్లాలో ఏడువేల డెంగ్యూ కిట్లను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తోందని వాటిని పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు అందజేస్తామన్నారు. డెంగ్యూ, మలేరియా కేసులపై వైద్యాధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు అభిషేక్, సూరజ్ గనోరే, డీఎంహెచ్‌వో డాక్టర్ జమల్‌బాషా, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా రీసర్వే

భూముల రీసర్వే లక్ష్యాలకు అనుగుణంగా సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని తహసీల్దార్లు, సర్వే అధికారులతో భూముల రీసర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మండలాల వారీగా పూర్తి చేసిన సర్వే ప్రగతిపై సూచనలిచ్చారు. 200 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మరో 200 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉందని లక్ష్యాలను నిర్దేశించారు. రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని స్పష్టం చేశారు. మ్యూటేషన్లను పూర్తి చేయాలని సూచించారు. ఈనెల 13 నుంచి 19 వరకు సర్వే చేసిన గ్రామాల వివరాలను ఆయన తెలుసుకున్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేకే లైన్‌లో రైళ్ల రాకపోకలు పునరుద్ధరణ



రైల్వేట్రాక్‌పై బండరాళ్ల తొలగింపు



పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌సత్పతి

అనంతగిరి: కొత్తవలస–కిరండూల్ మార్గంలో రైళ్ల రాకపోకలను మంగళవారం మధ్యాహ్నం నుంచి పునరుద్ధరించారు. ఈ మార్గంలో బొర్రా, కరకవలస మధ్యలోని రైల్వేపట్టాలపై సోమవారం సాయంత్రం బండరాళ్లు జారిపడటంతో పట్టాలతో పాటుగా ఓహెచ్‌సీ విద్యుత్ స్తంభం దెబ్బతింది. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం రాత్రి నుంచే యుద్ధప్రాతిపదికన రైల్వే సిబ్బంది పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైయ్యారు. సంఘటన స్థలానికి డీఆర్‌ఎం అనూప్‌సత్పతి చేరుకుని, పనులను పర్యవేక్షించారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ప్రతికూల వాతవరణంలో సైతం ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టి 12 గంటలకే పూర్తిచేశారు. మధ్యాహ్నం 2.30 నుంచి కేకేలైన్‌లోని యథావిధిగా రైళ్ల రాకపోకలు మొదలయ్యాయి. యుద్ధప్రతిపాదికన పునరుద్ధరణ పనులు చేపట్టిన కార్మికులు, సిబ్బందిని రైల్వే డీఆర్‌ఎం అనూప్ సత్పతి అభినందించారు. ఆయన వెంట ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్‌సాహూ, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి, ఛీఫ్ ఇంజినీర్ కేడీరావు పాల్గొన్నారు.

పాపికొండలు పర్యాటకం పునఃప్రారంభం



పర్యాటకులతో బయలుదేరిన హరితా బోట్

వీఆర్‌పురం: తుపాను కారణంగా గత నెల 20వ తేదీన నిలిచిపోయిన పాపికొండలు పర్యాటకం వాతావరణం అనుకూలంగా ఉన్నందున మంగళవారం పునఃప్రారంభించేందుకు సబ్‌కలెక్టర్ సూరజ్ గనోరే అనుమతి ఇచ్చారు. ఈ విషయాన్ని టూరిజం యూనిట్ ఇన్‌చార్జ్ మేనేజర్ రాజేష్ తెలిపారు. 30 మంది పర్యాటకులతో ఏపీ టూరిజమ్‌కు చెందిన హరితా బోట్ పాపికొండల పర్యటకానికి గోదావరి నదిలో వెళ్లిందని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

డెంగ్యూపై అప్రమత్తత అవసరం

• సబ్ యూనిట్ అధికారి కన్నబాబు

గూడెంకొత్తవీధి: డెంగ్యూపట్ల అప్రమత్తంగా ఉండాలని చింతపల్లి సబ్ యూనిట్ అధికారి ఆర్. కన్నబాబు సూచించారు. కడుగుల గ్రామంలో ఆయన మంగళవారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలను నివారించగలిగితే వ్యాధికి దూరంగా ఉండవచ్చన్నారు.దోమల నివారణ మందు పిచికారీ చేశారు. ఎంటీసీ శ్రావణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



మృతుని కుటుంబ సభ్యులకు బీమా నగదు అందచేస్తున్న సర్పంచ్ జయ తదితరులు

వీఆర్‌పురం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తెల్లవారిగూడెం గ్రామానికి చెందిన బంధం బజారు కుటుంబ సభ్యులకు మంగళవారం వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును సర్పంచ్ బంధం జయ అందజేశారు. మిగిలిన బీమా నగదు రూ.90 వేలు బ్యాంక్ ఖాతాకు నేరుగా జమ అవుతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ బంధం రాజు, వలంటీర్ బంధం విజయ పాల్గొన్నారు.

ఇటుకల వ్యాన్ బోల్తా



ప్రమాదానికి గురైన వ్యాన్

చింతపల్లిరూరల్: మండలంలో పెద్దగడ్డ వద్ద మంగళవారం ఓ ఇటుకల వ్యాన్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నర్సీపట్నం నుంచి సప్పర్ల వెళ్తున్న వ్యాన్ ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: సంక్షేమం,అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ జగనన్న ప్రభుత్వమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. ఒక పక్క వర్షం కురుస్తుండగా మండలంలోని అత్యంత మారుమూల బరడ పంచాయతీ వాండ్రంగుల, సొగ్గుల, బిమిడి గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల గిరిజనులతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అమలు తీరు,గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆమె తెలుసుకున్నారు. గ్రామాల్లో రచ్చబండల వద్ద ప్రజలతో సమావేశం నిర్వహించారు. వారి నుంచి వినతులు స్వీకరించారు. గ్రామాల్లో సీసీ రోడ్డులు, డ్రైనేజీలు, రోడ్లు, పాఠశాల భవనాలు, వీధి లైట్లు వంటి తదితర సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. వీటి పరిష్కారిస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ గిరిజన పల్లెలో ముఖ్యమంత్రి జగనన్న ప్రజా సంక్షేమానికి,గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల కనుసైగల్లో పథకాలు మంజూరు అయ్యేవన్నారు. తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హత ఉంటే పథకాలు అందుతున్నాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, సర్పంచులు పార్వతమ్మ, భాగ్యవతి, ఎంపీటీసీ నొబ్బో, కమల పాల్గొన్నారు.



ఏనుగురాయిలో ధ్రువ పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

అర్జీదారుల గడప వద్దకే సేవలు

ముంచంగిపుట్టు: జగనన్న సురక్ష పథకంతో అర్జీదారుల గడప వద్దకే ప్రభుత్వ సేవలందుతున్నాయని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభ ద్ర అన్నారు. మండలంలోని ఏనుగురాయి గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 419 మందికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం సుభద్ర మాట్లాడుతూ అర్హులైన ప్రతీ పేదవానికి ప్రభుత్వ పథకాలు నూరు శాతం అందించాలనే లక్ష్యంతో వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జగనన్న సురక్ష ద్వారా త్వరితగతిన క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం జరుగుతోందని చెప్పారు. ఒక్కరోజులోనే 200 మంది ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేయడంతో సచివాలయం సేవలపై పలు గ్రామాల గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్‌లు నరిసింగరావు,నోబిన,భాగ్యవతి, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, కమల,ఎంపీడీవో ఆర్.వి.ఎస్. రమేష్, తహసీల్దార్ నర్సమ్మ, వైఎస్సార్‌సీపీ మండల నేతలు జగబంధు, మూర్తి, కొండలరావు, తిరుపతిరావు, సన్యాసిరావు, జయదేవ్, రాంప్రసాద్, తిరుపతి పాల్గొన్నారు. మంగళవారం ఉదయం అధికారులు మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రంలోను జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు.

ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థులకు సువర్ణావకాశం

- నేవల్ డాక్‌యార్డ్‌లో 6 నెలల పాటు ఇంటర్న్‌షిప్
- ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసిన నేవీ, ఏయూ అధికారులు

దొండపర్తి(విశాఖ): ఆంధ్రా యూనివర్సిటీ, దాని గుర్తింపు పొందిన ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు సువర్ణావకాశం లభించనుంది. నేవల్ డాక్‌యార్డ్‌లో ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కలగనుంది. ఇందుకు సంబంధించి ఏయూ వీసీ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ సంజయ్‌సాధు, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్‌లు మంగళవారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. దీని ప్రకారం ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, మెరైన్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్ డిపార్టుమెంట్‌కు సంబంధించిన విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ రక్షణ రంగంతో ఒప్పందం చేసుకోవడం చారిత్రాత్మక విషయమన్నారు. విద్యార్థులు డిఫెన్స్‌లో అధునాతన సాంకేతికతపై 24 వారాల పాటు అధ్యయనం చేసే అవకాశం లభించడం మంచి అవకాశమని పేర్కొన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశ ప్రయోజనాల కోసం భారత సాయుధ దళాలతో ఇప్పటి వరకు 30 ఎంవోయూలపై సంతకాలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నేవీ నుంచి హెచ్‌ఆర్ జీఎం కమడోర్ అనూప్ మీనన్, హెచ్‌ఆర్ అడిషనల్ జనరల్ మేనేజర్ కమడోర్ ఆర్.వెంకటేశ్వరన్, డిప్యూటీ జీఎం(క్యూఏ) కెప్టెన్ సుబ్రతో మండల్, ఏయూ సెంటర్ ఫర్ డిఫెన్స్ స్టడీస్ అడ్జంక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉజ్వల్ కుమార్ ఘటక్, ఇతర ఏయూ అధికారులు,విభాగాధిపతులుపాల్గొన్నారు.



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న నేవల్ డాక్‌యార్డ్ అడ్మిరల్ సూపరింటెండెంట్, రియర్ అడ్మిరల్ సంజయ్‌సాధు, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్

ఆయిల్‌పామ్ ధర పతనం

- గతంలో టన్ను రూ.15వేలు
- ప్రస్తుతం రూ.12,500
- నష్టపోతున్నామని రైతుల ఆవేదన



జడ్డంగి కొనుగోలు కేంద్రం వద్ద ఆయిల్‌పామ్ గెలల తూకం

రాజవొమ్మంగి: ఆయిల్ పామ్ ధర రోజు రోజుకు తగ్గిపోతుండటం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం మండలంలోని జడ్డంగి కేంద్రం వద్ద పెద్దాపురానికి చెందిన చెందిన పతంజలి పామాయిల్ కంపెనీ రైతుల నుంచి టన్ను రూ.12,500కు కొనుగోలు చేసింది. ఇటీవల టన్ను రూ.15 వేలు ఉండగా ఇప్పుడు రూ.12,500కు పడిపోవడం వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోయారు. ఎకరాకు రూ.60 వేలకు మించి పెట్టుబడి కాగా ప్రస్తుతం లభిస్తున్న ధర వల్ల ఏమాత్రం లాభం లేదని వారు పేర్కొన్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది.

ధర స్థిరంగా లేక నష్టం



మార్కెట్లో ఎంతో డిమాండ్ ఉన్నప్పటికీ తాము పండించే పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. ధర స్థిరంగా లేకుంటే నష్టం తప్పదు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలి. – **ఎలిసేటి నాగేంద్రప్రసాద్, ఆయిల్‌పామ్ రైతు, జడ్డంగి**

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- సంఘటన స్థలంలో ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు

పాడేరు రూరల్ : పాడేరు–చోడవరం ఘాట్‌రోడ్డులోని మోదకొండమ్మ తల్లి పాదాల రెండో మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సతీష్, విక్రమ్ అనే ఇద్దరు యువకులు వ్యక్తిగత పనుల నిమిత్తం పాడేరు వచ్చారు. పనులు ముగించుకొని మంగళవారం మధ్యాహ్నం తిరిగి బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా మోదకొండమ్మ అమ్మవారి పాదాలు రెండో మలుపు వద్ద చోడవరం నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలు పాలైన విక్రమ్‌ను స్థానికులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలి

పెదబయలు: మండలంలోని రైతులు కాఫీ,ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలని స్థానిక తహసీల్దార్ సీహెచ్.కృష్ణారావు,ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. ఐటీడీఏ సౌజన్యంతో పోలీసు అధికారులు మంగళవారం నిర్వహించిన పరివర్తన కార్యక్రమంలో భాగంగా రైతులకు మొక్కలు పంపిణీచేశారు. మండలంలోని సీతగుంట,బొండాపల్లి,లక్ష్మీపేట,అడుగులపుట్టు పంచాయతీల్లోని రైతులకు 22,300 మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంజాయికి దూరంగా ఉండాలని,సంప్రదాయ పంటల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోయిపల్లి సర్పంచ్ బొండా చిట్టి, ఉపాధి ఏపీవో కె.ఎల్.ఎన్. మూర్తి, ప్లాంటేషన్ మేనేజన్ రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండలరావు,అప్పలరాజు,వ్యవసాయ,ఉద్యానవన సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



బొండాపల్లిలో రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ కృష్ణారావు

గంజాయి కేసులో ఒడిశా వ్యక్తి అరెస్టు

కె. కోటపాడు : గంజాయి రవాణాకు సహకరిస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రఫుల్ బడనాయక్‌ను మంగళవారం అరెస్టు చేసినట్టు సీఐ బి.తాతారావు, ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. వారు ఎ.కోడూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఈ కేసు వివరాలను విలేకరులకు తెలిపారు. వివరాలివి. గత నెల 29వ తేదీన వారాడ గ్రామంలో కారులో తరలిస్తున్న 110 కిలోల గంజాయిని, ఇద్దరు నిందితులు దేవనంద్ పాండా, కన్నా సాహూలను అరెస్టు చేశారు. గంజాయిని తరలించేందుకు సహకరిస్తున్న వారి వివరాలను నిందితుల ద్వారా పోలీసులు రాబట్టారు. గంజాయి తరలింపునకు ఒడిశాకు చెందిన మధుముదలి, ప్రఫుల్‌బడనాయక్ సహకరించినట్టు దర్యాప్తులో తేలిందని, మధుముదలిని గత నెల 30న అరెస్టు చేయగా, ప్రఫుల్‌బడనాయక్‌ను మంగళవారం అరెస్టు చేశామని సీఐ, ఎస్‌ఐ తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తాతారావు, ఎస్‌ఐ రామకృష్ణ

అప్పన్నను దర్శించుకున్న పార్లమెంటరీ కమిటీ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం అధికార భాషా సంఘం పార్లమెంటరీ కమిటీ దర్శించుకుంది. కమిటీ సభ్యులు శ్రీరామ్ చంద్ర జంగ్రా, ఐరన్న కడకి, సుజీత్‌కుమార్ స్వామిని దర్శించున్న వారిలో ఉన్నారు. వీరికి ఆలయ రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కమిటీ సభ్యులు ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదం, స్వామివారి జ్ఞాపికను ఏఈవో భ్రమరాంబ అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని, ఆలయ శిల్పసంపద ఎంతో బాగుందని, పూజా విధానం ఆకట్టుకుందని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం కమిటీ సభ్యులు నేషనల్ హైవే అథారిటీ, హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బీఈఎంఎల్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ హిందుస్థాన్ షిప్‌యార్డ్, రాష్ట్రీయ ప్రద్యోగికి సంస్థాన్, భారతీయ ప్రబంధన్ సంస్థాన్ అధికారులు, ప్రతినిధులతో ఆయా సంస్థలలో అధికార భాషా అమలు తీరుపై సమీక్షించారు.



అప్పన్న ఆలయంలో పార్లమెంటరీ కమిటీ

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్ ఏ-ప్లస్ గ్రేడ్

తెలుగు రాష్ట్రాల్లో సాధించిన తొలి కళాశాల ఇదే..

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నాక్ ఏ–ప్లస్ గ్రేడ్ వచ్చింది. ఈ మేరకు బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్(నాక్) ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ఆంధ్రా, తెలంగాణలోని మరేతర ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలకు అందని విజయం తాము సాధించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతుల కల్పన, విద్యా బోధనలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అమలు, పరిశోధన, నాయకత్వ లక్షణాలు అలవరచడం, పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యను అందుబాటులోకి తీసుకురావడం వంటి అంశాల్లో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల దూసుకుపోతోందన్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని 2023–2028 వరకు కళాశాలకు నాక్ ఏ–ప్లస్ గ్రేడ్ గుర్తింపు వచ్చిందన్నారు. ఇది సమష్టి విజయమని పేర్కొన్నారు. విద్యార్థులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.



విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

ప్రైవేట్ యాజమాన్యాలకు విశాఖ కలెక్టర్ హెచ్చరిక

మహారాణిపేట(విశాఖ): పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలను నచ్చిన వారి వద్ద కొనుగోలు చేసుకునే స్వేచ్ఛ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఉందని.. ఈ విషయంలో యాజమాన్యాలు ఎటువంటి ఒత్తిడి చేయొద్దని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున హెచ్చరించారు. అధిక ఫీజులు వసూలు చేయరాదని, ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే డీఈవో, ప్రాంతీయ ఇంటర్మీడియట్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారువిద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయవద్దని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయంపై తనకు కూడా నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

వెంకన్నను దర్శించుకున్న సినీ హీరో గోపీచంద్

రంపచోడవరం: ఇక్కడికి సమీపంలో టీటీడీ నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సినిమా హీరో గోపీచంద్ సోమవారం రాత్రి సందర్శించారు. స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.రంపచోడవరం పరిసర ప్రాంతాల్లో ఆయన నటిస్తున్న సినిమా షూటింగ్ పది రోజులుగా జరుగుతోంది.



ఐ పోలవరం వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించిన హీరో గోపీచంద్

ఆగి ఉన్న లారీని ఢీ కొట్టి వ్యక్తికి గాయాలు

పాయకరావుపేట: స్థానిక జాతీయ రహదారిపై ఓ వ్యక్తి బైక్‌పై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడినట్టు ఏఎస్‌ఐ గోవిందు తెలిపారు. తునికి చెందిన అంటివేలు కుమార్ తుని నుంచి బైకుపై నక్కపల్లి వైపు వెళ్తుండగా వై జంక్షన్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన ఆగివున్న లారీని వెనుక భాగం బలంగా ఢీ కొట్టాడు. ఈ ఘటనలో కుమార్ తలకు బలమైన గాయమైంది. అతనిని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించినట్టు ఏఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.




లారీని ఢీ కొట్టి గాయపడిన వ్యక్తి

14న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం(విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 14న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.శాంతి(టెక్నికల్) తెలిపారు. ఎనాలిస్ ల్యాబ్, వసంత్ కెమికల్, ఎక్సెల్ ఇండస్ట్రీస్ టీం లీజ్ యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, హై–గ్రో కెమికల్స్, ఫార్మాటెక్స్, వరుణ్ మోటర్స్, నైవేద్య రెస్టారెంట్, ది పార్క్ హోటల్ యాక్సిస్ బ్యాంక్ తదితర కంపెనీల్లో 215 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ప్రాసెస్ అసోసియేట్, కాల్ అసిస్టెంట్, ఆపరేటర్, కస్టమర్ రిప్రెసెంటేటివ్ ఎగ్జిక్యూటివ్, కెమిస్ట్, క్యాషియర్, జూనియర్ క్యాడ్ ఇంజనీర్, వెర్‌హౌస్ అసోసియేట్స్, జీఐఎస్ ఇంజనీర్ కేడ్, అకౌంటెంట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్, కేర్ టేకర్స్, సెక్యూరిటీ గార్డ్స్, బ్రాంచ్ గోడౌన్ ఇన్‌చార్జ్, కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఏదైనా డిగ్రీ, పోస్ట్ గ్యాడ్యుయేట్, ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏల్లో ఉత్తీర్ణత సాధించి 18–37 సంవత్సరాల వయసు కల్గిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాల బట్టి జీతం నెలకు రూ.10,000 నుంచి రూ.27,000ల వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ముగిసిన జిమెక్స్ విన్యాసాలు



విన్యాసాల్లో పాల్గొన్న యుద్ధ నౌకలు

దొండపర్తి: జపాన్ ఇండియా మారీటైం విన్యాసాలు(జిమెక్స్) మంగళవారంతో ముగిశాయి. బంగాళాఖాతంలో ఇరుదేశాల నేవీ అధికారులు ఒకరికొకరు వీడ్కోలు పలకడంతో 7వ ఎడిషన్ వ్యాయామాలు పూర్తయ్యాయి. రియల్ అడ్మిరల్ గుర్‌చరణ్ సింగ్ నేతృత్వంలోని భారత నౌకాదళ నౌకలు కమోర్టా, శక్తి, అలాగే జపాన్ నావికాదళం నుంచి కమాండర్ ఎస్కార్ట్ ఫ్లొటిల్లా నిషియామా తకహీరో నేతృత్వంలో జపాన్ మారీటైమ్ సెల్ఫ్‌డిఫెన్స్ ఫోర్స్ నౌక జేఎస్ సమిదారే నౌకలు ఆరు రోజుల విన్యాసాల్లో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మూడు దశలలో ఉపరితలం, ఉప ఉపరితలం, గాలిలో ఇరు పక్షాలు తమ శక్తి సామర్థ్యాలను ప్రదర్శించాయి.